

కనెక్షన్ కోసం నిరీక్షణ

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో జాప్యం - ఏళ్ల కాలంగా దరఖాస్తులు పెండింగ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తాను మంత్రిగా బాధ్యతలు తీసుకునే సమయంలో అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఆ ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలుకావడం లేదు. వ్యవసాయ సాగుకు విద్యుత్ కనెక్షన్ కీలకం. అలాంటి కనెక్షన్లను వ్యవసాయానికి ఇవ్వడంలో అధికారులు తీవ్ర జాప్యం ప్రదర్శిస్తున్నారు. ఏళ్ల కాలంగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు..

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతోంది. ఆయకట్టుతోపాటు, నాన్‌ఆయకట్టులో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్ శాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. అధికారులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కర్నూలు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో 11,031 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండేళ్లకుపైగా కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో అంత పెద్ద ఎత్తున దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. దరఖాస్తులకు మోక్షం కలగకపోవడంతో రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం నిబంధనల ప్రకారం డీడీలు కట్టినా రైతులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. డీడీ తీసి దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి ఎస్టిమేషన్ వేయాలి. కానీ, కొందరు అధికారులు కావాలని సీరియల్ పేరుతో కనీసం ఎస్టిమేషన్ వేయకుండా కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరి కొందరు అధికారులు మామూళ్లు ముట్టజెప్పిన వారికి, ప్రజాప్రతినిధులు నుంచి ఒత్తిడి తెచ్చిన వారికి మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దరఖాస్తులు వస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల కొరత వల్లే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ సాగడం లేదని తెలుస్తోంది. 2,302 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరా పూర్తిగా నిలిచిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కాబట్టి రైతుల పొలాల్లో పంటలు ఉంటాయని, ఆ పంటలలో వెళ్లి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు వీలు ఉండదని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.





సవా లక్ష నిబంధనలు..

వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ జారీకి ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు విధించింది. దరఖాస్తుతోపాటు దాదాపు 15 రకాల పత్రాలను జతచేయాలి. వీటిల్లో కొన్ని పత్రాలను రెవెన్యూ అధికారులు జారీ చేయాలి. మామూళ్లు ఇస్తేనే సంబంధిత పత్రాలు ఇస్తున్నారని రైతులు ఆరోపి స్తున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాలంటే మీ-సేవాలో దరఖాస్తు చేసుకోవాలి. దీంతోపాటు ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, వీఆర్వో అనుమతి పత్రం, వాల్టాకు సంబంధించి తహసీల్దార్ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌ఒసి), బోర్ వెల్ కంపెనీ నుంచి ధ్రువీకరణ పత్రం, ఇంతవరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ తీసుకోలేదని ధ్రువీకరిస్తూ వ్యక్తి గత పూచీ పత్రం, పొలానికి సంబంధించి పట్టాదారుపాస్ పుస్తకం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పొలంలో గత మూడేళ్లలో సాగు చేసిన పంటల వివరాలు, తదితర 15 రకాల పత్రాలను జతచేయాలి. అత్యధిక పత్రాలు రెవెన్యూ పరంగా జారీచేయాల్సి వుండడంతో మామూళ్లు ఇవ్వనిదే పనిచేయడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ పరిస్థితి లేదని, వీఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేస్తే సరిపోయేదని చెబుతున్నారు.

పైరవీలకే పెద్దపీట

- కీలక శాఖలో నేతల సిఫార్సులకే పచ్చ జెండా
- అక్టోబర్ 2 తర్వాత కొత్త అధికారులు - ముగిసిన బదిలీల ప్రక్రియ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

అందరూ అనుకున్నట్లుగానే కూటమి ప్రభుత్వం బదిలీల ప్రక్రియలో తన మార్కును ప్రదర్శించింది. ఇందులో భాగంగా కూటమిలోని ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేసిన వారికే కీలక శాఖలోని ఉద్యోగుల బదిలీలు చేశారు. తమ పనులను చక్కదిద్దే వారిని మాత్రమే ఈ బదిలీల్లో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేయించుకుని వేసుకున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండున్నర నెలల తర్వాత సాధారణ ఉద్యోగుల బదిలీలకు చర్యలు తీసుకుంది. విద్య, వైద్యారోగశాఖలను మినహాయించి అన్ని శాఖల్లో బదిలీలను చేపట్టింది. ఇందులో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీ చేసింది. ఇందులో భాగంగా రెవెన్యూ పంచాయతీ రాజ్, తాగునీటి సరఫరా వంటి కీలక శాఖలో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి బదిలీలను చేశారు. పంచాయతీరాజ్ విభాగంలో పంచాయతీ కార్యదర్శుల నియామకాలు మొత్తం అధికార పార్టీ నేతల సిఫార్సు లేఖల ఆధారంగానే పూర్తి చేశారు. ఎంపీడీవోలను కూడా తమ అనుకూలమైన వారిని ఆయా మండలాలకు ప్రజాప్రతినిధులు వేయించుకున్నారు. రెవిన్యూ శాఖలో తహశీల్దార్లు ,డిప్యూటీ తహసిల్దారులు తోపాటు వీఆర్వోలు బదిలీలను మొత్తం అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కను సన్నల్లోనే జరిగింది. మండలాల తాసిల్దార్ల నియామకంలో గతంలో ఆ మండలంలో పని చేయనటువంటి వారిని కాకుండా కొత్తవారిని తెచ్చుకొని తమ పనులను పూర్తి చేసుకున్నందుకు బదిలీ చేయించుకున్నారు. అలాగే గ్రామాల్లో విఆర్వోలు బదిలీలు కూడా వారికి అనుకూలమైన వారిని నియమించుకున్నారు. డిఆర్డిఏ మరియు డ్వామా వంటి శాఖల్లో కూడా బదిలీల ప్రక్రియను చేశారు. ఉపాధి హామీ పథకం అమలుతోపాటు పొదుపు సంఘాల మహిళల వంటి అంశాలు ముడిపడి ఉండడంతో ఇక్కడ కూడా అనేకమందిని కొత్తవారిని నియమించారు.

కీలక శాఖలో అధికారులు మార్పు

జిల్లాలోని అనేక ప్రభుత్వ కీలక శాఖలో అధికారులను మార్పు చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అమర్నాథ్ రెడ్డిని ఇకనుండి మదనపల్లి డిఎల్‌డిఒగా బదిలీ చేశారు. పల్నాడులో పనిచేస్తున్న శివప్రసాదను ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం ఇక్కడికి బదిలీ అయినా శివప్రసాద్ కూడా జిల్లాకు వచ్చేందుకు సుముఖత లేనట్లు సమాచారం. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న సలీం బాషను అనంతపురం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టుగా బదిలీ చేశారు. ఇక్కడికి గతంలో ఆర్థిక శాఖ మంత్రి వద్ద ఒఎస్‌డిగా పనిచేసిన ప్రతాప్ రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. జిల్లా పరిషత్తు సిఇఒగా నాసరరెడ్డిని యధావిధిగా కొనసాగిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడును అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడికి కర్నూలు జిల్లాలో జిల్లా నీటి యాజమాన్య సంస్థలో పనిచేస్తున్న భాస్కర్‌ను డిపిఒగా నియమించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా గతంలో ఇక్కడే పనిచేసిన రాజా రఘువీర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. గత ప్రభుత్వంలో నుండి పనిచేస్తున్న పౌరసరఫరాల కార్పొరేషన్ సంస్థ జిల్లా మేనేజర్ షర్మిలను హెడ్ క్వార్టర్స్ కు బదిలీ చేసి ఇక్కడికి నాగసుధను సమగ్ర శిక్ష అభియాన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కర్రన్న మాతృ సంస్థకు బదిలీ చేసి ఇక్కడికి ఆర్అండ్‌బి శాఖలో పనిచేస్తున్న శ్రీనివాసులను నియమించారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధాలింగమూర్తిని పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులను ఎవర్నీ రిలీజ్ చేయకుండా అక్టోబర్ రెండు వరకు యధావిధిగా కొనసాగలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాష నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 2 తర్వాత కొత్త అధికారులు బాధ్యతలను చేపట్టనున్నారు.



గుండె సదస్సుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

గుండె వ్యాధుల పట్ల అవగాహన

- కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గుండె వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని, ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం అవగాహనా కార్యక్రమం సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఫౌండేషన్ సెక్రటరీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 29న జరిగే కార్యక్రమానికి కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ డి.రాజశేఖర్, శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, తిరుపతి వారికి ఈ సంవత్సరం ఔట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును కర్నూలు హార్ట్ ఫౌండేషన్ తరపున అందజేయడం జరుగుతుందని తెలిపారు..కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లు కల్కూర చంద్రశేఖర్, డా.భవాని ప్రసాద్, ట్రెజరర్ రాముడు, సభ్యులు శర్మ, లక్ష్మణ్, వాసుదేవ మూర్తి, ప్రహ్లాద్, జగన్నాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

1న 'విశాఖ ఉక్కు' రక్షణ దీక్షలు

- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నిర్ణయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థులు, యువకులు 34 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 1న జరిగే నిరసన దీక్షలు జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు సిఆర్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, పిడిఎస్‌యు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాష, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు , నగర కార్యదర్శి బీసన్న , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, పిడిఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఖండ, మహేంద్ర, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఆదిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను బిజెపి ప్రభుత్వం తన అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టడం కోసం ప్రైవేట్ పరం చేస్తుందన్నారు. దీన్ని రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అడ్డుకోకపోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం పాటుపడతామని ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానీయబోమని చెప్పి తీరా అధికారం చేపట్టిన తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామి అయి ఉండి కూడా విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ గురించి మాట్లాడలేకపోవడం సిగ్గుచేటన్నారు. తిరుపతి లడ్డు గురించి గగ్గోలు పెట్టే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు వేలాదిమందికి అన్నం పెట్టే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేక పోతున్నారని ప్రశ్నించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటారా లేక అంబానీ, ఆదానీల పక్షాన ఉంటారో తేల్చుకోవాలన్నారు. ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దశల వారి ఉద్యమంలో భాగంగా అక్టోబర్ ఒకటిన రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షల నిర్వహించాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘాల రాష్ట్ర సమితి పిలుపునిచ్చిందన్నారు. కర్నూలు దీక్షలో విద్యార్థి, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతు తెలుపాలన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఉద్యమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎఐఎస్ఎఫ్ నగర నాయకులు అశోకు, అభి, నగరనాయకులు చంటి, కాసిం, పిడిఎస్‌యు జిల్లా నాయకులు రమణ, మునిస్వామి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



ఎపి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మన్నె ధర్మవరం సుబ్బారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు టిడిపి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ధర్మవరం సుబ్బారెడ్డికి స్థానం దక్కింది. 2019లో టిడిపి ఓటమి పాలయిన తరువాత సుబ్బారెడ్డిని నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించారు. ఆ తరువాత ప్యాపిలి మండలం జలదుర్గంలో జరిగిన బాదుడే బాదుడు సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డోన్ టిడిపి అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించారు. తీరా ఎన్నికల సమయంలో ఆయనను కాదని డోన్ సీటును కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఇచ్చారు. అప్పుడు తన సీటును వదులుకున్నందుకు సుబ్బారెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సుబ్బారెడ్డికి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు.



ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలను వెంటనే చెల్లించాలని సమగ్ర శిక్ష ఉద్యోగ జెఎసి రాష్ట్ర కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ గత రెండు నెలల నుండి సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలు చెల్లించలేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామనిహెచ్చరించారు.

డిఆర్‌డిఒ సాంకేతిక బృందం ఇసుక రీచ్‌ల తనిఖీ

ప్రజాశక్తి-కర్నూల్ క్రైమ్

కర్నూలు మండల పరిధిలోని కొత్తకోట,సింగవరంలోని ఇసుకరీచ్‌లను కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులతో కలిసి డిఆర్‌డిఒ సాంకేతిక బృందం తనిఖీలు చేపట్టిందని కర్నూలు మైనింగ్‌శాఖ డిడి టి.రాజశేఖర్ తెలిపారు. జిల్లాలోని ఇసుకరీచ్‌ల నుంచి ఎంత మోతాదులో ఇసుక బయటికి తరలి వెళుతుంది, ఎంత మొత్తంలో ఇసుక డంప్ అవుతోంది అనే స్పష్టమైన ప్రమాణాలు కొలతలను గుర్తించేందుకు కస్టమైజ్డ్ కెమెరాలను ఇసుక రీచ్‌ల వద్ద అమర్చడానికి ఈ తనిఖీలు చేపట్టినట్లు మైనింగ్ డిడి తెలిపారు.



ఏకాగ్రతతో ఆర్చరీ సాధన చేయాలి

-ఎడిపై పాఠశాలలో ఉచిత ఆర్చరీ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులు క్రమశిక్షణతో, ఏకాగ్రతతో ఆర్చరీ సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎడిఫైపాఠశాల ప్రిన్సిపల్ జోసఫ్ డేవిడ్ అన్నారు.

సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉచిత ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు అందుబాటులో పురాతన విద్య అయిన ఆర్చరీ సాధన చేయించడం కోసం శిక్షకులను సైతం అందుబాటులోకి తీసుకువచ్చామని, తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను శిక్షణకు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్స్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైడ్రా తరహా చట్టం అవసరం

భూకబ్జాలు అరికట్టాలని కలెక్టరేట్ ఎదుట పిపిఎస్ఎస్ ధర్నా

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

రాజుల కాలం నాటి తాంద్రపాడు చెరువు, గాలిగోపురం చెరువులు, ప్రభుత్వ భూములు వాగులు, వంకలు, నదులు, జగన్నాథగట్టు కబ్జాలకు గురయ్యాయని, కర్నూలులో కూడా హైడ్రాలాంటి చట్టం తేవాలని పట్టణపౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నాయకులు ఎం.నాగరాజు, ఎండి యూనుస్, న్యాయవాది చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కబ్జాకు గురయిన భూములను సంరక్షించేందుకు హైడ్రా లాంటి చట్టం రాష్ట్రంలో తీసుకు రావాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఎం.నాగరాజు అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ కర్నూలు నగరానికి సమీపంలో ఉండే నగరవనం, దాని ఎదుట ఉన్న చెరువు, తుపాన్ల సందర్భంగా అలుగు ద్వారా వెళ్లే వరద నీటి వాగును, ప్రభుత్వ భూమి, ఆర్అండ్‌బి రోడ్డు కబ్జాకు గురైనా.. సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భూకబ్జాలపై అధికారులపై ప్రజాగ్రహం వెల్లువెత్తినా ఉన్నతాధికారులు కబ్జాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలపై విమర్శలు వస్తున్నాయని, వాటిపై ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేసి చెరువులు, ప్రభుత్వ భూములు వాగులు వంకలు, నదులు జగన్నాథం గట్టును కబ్జాల నుండి కాపాడాలన్నారు. కబ్జాలకు సంబంధించిన కొన్ని ఫోటోలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ అందజేశారు. ధర్నాలో కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు న్యాయవాది రిటైర్డ్ డిఎస్‌పి పాపారావు, శ్రీనివాసులు, అన్వర్ బాష, పీటర్, అస్సలాం,మధు, రమణ గౌడ్,ఉజేర్ అహ్మద్, శ్రీనివాసరెడ్డి, కృష్ణ, వన్నూరు సాహెబ్, రాజు,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నుద్దేశించి మాట్లాడుతున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి

వివాహిత ఆత్మహత్య



ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం కొసనపల్లి గ్రామానికి చెందిన వివాహిత ఈడిగ మహేశ్వరి(24) పిల్లలు పుట్టలేదని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన పద్మావతి కుమార్తె మహేశ్వరికి వెల్దుర్తి మండలం కొసనపల్లి గ్రామానికి చెందిన ఈడిగ మధుగౌడ్ తో వివాహమైంది. పిల్లలు పుట్టకపోవడంతో మన స్థాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున ఇంటిలో వాస్మోల్ తాగింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వెల్దుర్తి సిహెచ్‌సికి తరలించగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఎపి అర్బన్‌ఫైనాన్స్ ఇన్ఫ్రాష్ట్రక్చర్ ,డెవలఫ్‌మెంట్‌మెంబర్‌గా రామాంజనేయులు

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్


గౌరుదంపతులతో రామాంజనేయులు


కల్లూరు మండల టిడిపి అధ్యక్షులు డి.రామాంజనేయులును ఎపి అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డిని డి.రామాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యశ్రీ పేషెంట్ల నుండి డబ్బు వసూలు

ఆస్పత్రులపై చర్యలకు డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లాలో అనేక హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ పేషెంట్ల నుండి మెరుగైన వైద్య సేవలు అందిస్తామనే పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ప్రయివేట్ హాస్పిటల్స్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్‌బాష, అబ్దుల్లా, నాయకులు వీరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిఎంహెచ్ఒకు డివైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో కొన్ని సర్వీసుల విషయంలో కొన్ని పరిమితులను నిర్దేశించిందని, ప్రవేట్ హాస్పిటల్స్ చెబుతున్నాయని, ఉదాహరణకు ఆరోగ్యశ్రీలో ఈ కళ్లద్దాలు వస్తాయి మంచి కళ్లద్దాలు కావాలంటే డబ్బులు ఇవ్వాలని అడుగుతున్నారు. సిజేరియన్, అర్థో, గుండె, సంబంధిత ఆపరేషన్ల విషయంలో కూడా ప్రభుత్వం నుండి తక్కువ డబ్బు వస్తుందని ఆరోగ్యశ్రీలో మీకు ఈ ఆపరేషన్ చేయలేమని అదనంగా డబ్బులు ఇస్తే చేస్తామని ఆస్పత్రి యాజమాన్యాలు చెబుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వర్తించే జబ్బులన్నింటికీ ఎలాంటి రుసుం వసూలు చేయకుండా పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రెస్ మీట్ పెట్టి ఆరోగ్యశ్రీ పేషంట్ల నుండి డబ్బులు వసూలు చేసిన హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ కొన్ని హాస్పిటల్స్ ఇంకా డబ్బులు వసూలు చేస్తున్నాయని తెలిపారు.



డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


క్రిష్ణగిరి స్టేషన్‌లో రికార్డులనుపరిశీలిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా

- -పోలీస్ పికెట్, క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్ల తనిఖీ
- -ప్రజలతో సత్‌సంబంధాలు కలిగికి ఉండాలి
- -కర్నూలు జిల్లా ఎస్‌పి బిందుమాధవ్

ప్రజాశక్తి -క్రిష్ణగిరి


చెరుకులపాడు పికెట్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

ఫ్యాక్షన్ గ్రామాల పై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్‌పి బిందుమాధవ్ సూచించారు. క్రిష్ణగిరి మండలం చెరుకులపాడు, క్రిష్ణగిరి, వెల్దుర్తి పోలీస్‌స్టేషన్లను సందర్శించి మంగళవారం తనిఖీ చేశారు. క్రిష్ణగిరి పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీట్స్ , సస్పెక్ట్ షీట్స్, హిస్టరీషీట్స్‌ను పరిశీలించారు. పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఫ్యాక్షన్ గ్రామాల గురించి ఆరా తీశారు. అనంతరం క్రిష్ణగిరి మండలం చెరుకులపాడు ఫ్యాక్షన్ గ్రామంలో ఎస్‌పి పర్యటించారు. పోలీసు పికెట్‌ను తనిఖీ చేశారు. ఎస్ఐ, పోలీసు సిబ్బందితో మాట్లాడి , పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని తెలిపారు. ఆయా గ్రామాల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల ప్రజలతో సమన్వయంతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురి కాకుండా ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిఐలు ప్రసాద్, మధుసుధన్‌రావు, క్రిష్ణగిరి ఎస్ఐ కె. మల్లికార్జున ఉన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోనీ పంట పొలాలకు సేంద్రియ ఎరువుల వాడకంపై ఎఒ మల్లేష్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చింతమానుపల్లి గ్రామంలో పంటలను పరిశీలించారు. పంటల మార్పిడిలతో అధిక ఆదాయం పొందవచ్చున్నారు. వ్యవసాయ అనుబంధ పథకాలను లాభసాటిగా మార్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. చీడ పురుగుల నివారణకు అధికారుల సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని


పట్టణ శివారులోని అసంపూర్తిగా ఉన్న పేదల పక్కా గృహాల నిర్మాణంలో పురోగతి సాధించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మంగళవారం గృహ నిర్మాణ సముదాయాన్ని, ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. పురోగతిపై అధికారులతో కలిసి ఇంటి నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను పరిశీలించి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, తహశీల్దార్ శివరాముడు, గృహ నిర్మాణ శాఖ ఎఇ శివ మూర్తి ఉన్నారు.

పౌర సరఫరాల గోడౌన్ తనిఖీ

ఆదోనిరూరల్ : ఆదోని పౌర సరఫరాల గోడౌన్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడారు. బియ్యం కార్డుదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. తహశీల్దార్ శివ రాముడు, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దార్ వలీబాష పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌గా విజయరాజు

ప్రజాశక్తి - కౌతాళం



డిప్యూటీ కమిషనర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి డిప్యూటీ కమిషనర్‌గా విజయ రాజు బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అందరి సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. దేవదాయ శాఖ కమిషనర్ డిసిగా విజయరాజును నియమించి, ఇక్కడ పనిచేస్తున్న హెచ్‌జె.వెంకటేష్‌ను కేంద్ర కార్యాలయానికి బదిలీ చేశారు.

విజయ రాజుకు సన్మానం : డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయరాజును టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొట్రేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. టిడిపి ఉరుకుంద గ్రామ నాయకులు సురేంద్ర, కురుగోడు పాల్గొన్నారు.

ఘనంగా భూపాల్ చౌదరి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని



భూపాల్ చౌదరిని సన్మానిస్తున్న నాయకులు

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొంక భూపాల్ చౌదరి పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో ఉచిత భోజన సదుపాయం కల్పించారు. అంతకుముందు పూలమాలతో సన్మానించి, భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకులు బుద్ధారెడ్డి, తిమ్మప్ప, వెంకటేష్, లక్ష్మీనారాయణ, జయరామ్, చిట్టి, రాజు, బాలకృష్ణ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షులు సజ్జత్, ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ముజిబా అహ్మద్ భూపాల్ చౌదరికి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ భూపాల్ చౌదరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పూలమాల, శాలువాతో సన్మానించారు.

ప్రజా సేవకులకు అభినందన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఆల్ఫ్రెడ్ రాజును సన్మానిస్తున్న ఎంపిజె, ఐవైఎం సభ్యులు

విజయవాడ వరద బాధితులకు సేవా కార్యక్రమాలు చేపట్టి పట్టణానికి చేరుకున్న మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, దాదాపు 20 మందిని ఎంపిజె, ఐవైఎం ఆధ్వర్యంలో అభినందించారు. మంగళవారం పట్టణంలోని వీవర్స్ కాలనీలోని అలీ ఇనిస్టిట్యూట్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షులు చాందన్న మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా ఆల్ఫ్రెడ్ రాజు చేపడుతున్న సేవా కార్యక్రమాలను యువత అనుసరించాలని కోరారు. ఐవైఎం పట్టణ అధ్యక్షులు ముల్లా ఇస్మాయిల్... దాదాపు రూ.8 లక్షల విలువ గల సామగ్రిని సేకరించి ఆల్ఫ్రెడ్ రాజు, టీం కలిసి విజయవాడలో వరద బాధితులకు అందించి రావడం అభినందనీయమని తెలిపారు. ఎంపిజె రాష్ట్ర ఉపాధ్యక్షులు లాల్కోట్ కదిరన్న మాట్లాడుతూ... పట్టణంలో ఆల్ఫ్రెడ్ రాజు తన సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారని చెప్పారు. అనంతరం ఆల్ఫ్రెడ్ రాజుకు, ఆయన టీం సభ్యులందరికీ శాలువా కప్పి మెమొంటోతో సన్మానించారు. ఎంపిజె జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, దాదు, ఐవైఎం సభ్యులు ఫయాజ్, ఉస్మాన్, ఎస్ఐఒ సభ్యులు మహేష్, పూలే అంబేద్కర్ సేవా సమాజం సొసైటీ నిర్వాహకులు నరసన్న, ప్రతిభ, జై భీమ్ నాయకులు ముత్తు సుమాల, డివైఎఫ్ఐ అజిత్, ఆరిఫ్, ఫయాజ్, మహేష్, ఉస్మాను, శీను పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

- డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంత

- హోరాహోరీగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

క్రీడలతోనే మానసికోల్లాసం, స్నేహ సంబంధాలు పెంపొందుతాయని డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంత తెలిపారు. ఆదోని నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) క్రీడా సంబరాలు మంగళవారం మున్సిపల్ క్రీడా మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటిరోజు ముఖ్య అతిథులుగా డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంత పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని బాలుర పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం సెల్ ఫోన్లు, టివిల గేమ్స్‌కు పరిమితమై శారీరక, మానసికోల్లాసాన్నిచ్చే క్రీడలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ల వల్ల బుద్ధిమాంద్యం, మానసిక వైకల్యం ఏర్పడుతుందే తప్ప ఆరోగ్యం ఇవ్వవని తెలిపారు. విద్యార్థి దశ నుంచి వాటికి దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మొదటిరోజు బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14 కబడ్డీలో ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నేడు బాలికలకు అండర్-14, అండర్-17 క్రీడా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఎంఇఒ శ్రీనివాసులు, మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీం సిద్ధికి, ఎస్‌జిఎఫ్ కోఆర్డినేటర్ నరసయ్య, రామన్న, ముజాహిద్ హుస్సేన్ పాల్గొన్నారు.



అండర్-14 విజేతకు ట్రోఫీని అందిస్తున్న నరసయ్య

భాష్యం విద్యార్థుల ప్రతిభ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 ఖోఖో ఫైనల్‌లో భాష్యం-2 బ్రాంచి విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల సిఇ అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆదోని మున్సిపల్ మైదానంలో టోర్నమెంట్ జరిగింది. ఖోఖోలో పెద్దతుంబలంపైన గెలుపొంది జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను సిఇ అనిల్ కుమార్, జడ్ఇఒ మాచాని కవిత, ప్రిన్సిపల్ రవి ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ అంజి, పిటి బలరాములు అభినందించారు.



గెలుపొందిన విద్యార్థులు

'నూర్ బాష కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం'

ప్రజాశక్తి- దేవనకొండ

ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూర్ బాష కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, హజ్ యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించడం హర్షణీయమని దూదేకుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.మాలిక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన దూదేకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు పట్ల ప్రకటన చేయడం శుభ పరిణామమని చెప్పారు. సరస్వతి స్కూల్ కరస్పాండెంట్ ముజీ, ఉపాధ్యాయులు నబీ రసూల్, సత్తార్, రెయిన్‌బో అల్లీపీరా, ఖాసీం, రహిమాన్, క్లాసిక్ రాజు, సుభాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు అధ్యక్షతన మంగళవారం ఎన్ఎస్ఎస్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్ హాజరయి మాట్లాడారు. 'మనం పదిమందిలో ఉన్నప్పుడు మన వల్ల ఆ పదిమందికి ప్రయోజనం ఉండాలి. లేదా మన వల్ల మరొకరికి మేలు కలగాలి' అని తెలిపారు. ఆ విధంగా పరస్పర సహకారంతో, మంచిగా మెలగడం సంఘానికి సేవ చేయడమే అవుతుందని చెప్పారు. కళాశాలలో చదువుకునే విద్యార్థులు నేషనల్ సర్వీస్ స్కీంలో సభ్యులుగా చేరి ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను నెరవేర్చాలని కోరారు. కళాశాలను పరిశుభ్రంగా ఉంచుతూ, పరిసర గ్రామాలను దత్తత తీసుకోవాలని తెలిపారు. మొక్కలు నాటడం లాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. జెవివి నాయకులు లక్ష్మీప్రసాద్ యాదవ్ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అధ్యాపకులు సుబ్రమణ్యం, వసంత, కిరణ్మయి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్

రాష్ట్రాభివృద్ధికి బాబు కృషి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలి
- ఎంపీ బస్తిపాటి నాగరాజు
- ఘనంగా 'ఇది మంచి ప్రభుత్వం

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడే తపనను తాను కళ్లారా చూశానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని చిలుకలడోన గ్రామంలో ఎంపిడిఒ మణిమంజరి అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ నాగరాజు, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉన్నందున కేంద్ర ద్వారా నిధులు తెచ్చి అభివృద్ధికి కృషి చేయాలని చంద్రబాబు కోరారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించే విధంగా కషి చేయాలని కోరారు. అనంతరం రాఘవేంద్ర రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు వైసిపి వర్గానికి కొమ్ము కాస్తున్నారని, ఇది మానుకోవాలని హితవు పలికారు. టిడిపి యువ నాయకులు తిక్కయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. జనసేన ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న, బిజెపి మండల ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, మాలపల్లి మాజీ సర్పంచి చావిడి వెంకటేష్, ఎపివిబిఎస్ మండల కార్యదర్శి చేపల నాగేష్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, ప్రత్యేకాధికారి నారాయణ మూర్తి, ఇఒఆర్‌డి ప్రభావతి, సిఐ రామాంజులు, గ్రామ కార్యదర్శి ఇస్రత్ బాష పాల్గొన్నారు. **నందవరం** గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డికి టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్, పుష్పావతి, మాధవరావు దేశాయ్, దేవల్ల చిన్న రాముడు, దేవల్ల లక్ష్మన్న ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో నాలుగు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న సంకల్పంతో జలజీవన్ మిషన్ ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. రూ.40 లక్షలతో గ్రామంలో నాలుగు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామంలో ప్రతి మూలన సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన తాగునీటి హామీని నెరవేర్చుతామని చెప్పారు. రూ.1.15 కోట్లతో జలజీవన్ మిషన్‌ను ప్రారంభించామని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీరు అందిస్తామని చెప్పారు. ఎంపిడిఒ దశరథ రామయ్య, తహశీల్దార్ శ్రీనివాసులు, మండల విస్తరణాధికారి ఈశ్వరయ్య స్వామి, ముగతి ఈరన్నగౌడ్, ధర్మపురం గోపాల్, హాలహర్వి నారాయణరెడ్డి, మైనార్టీ నాయకులు ఈసా, సోమల గూడూరు వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఇబ్రహీంపురం శంకరమ్మ, డబ్బా ఈరన్న, గురజాల శివారెడ్డి, జనసేన నాయకులు ఎల్లప్ప, బిజెపి నాయకులు ఈరన్న పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం నాగనాథనహళ్లి గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే నాగలాపురం, మాంత్రికి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి పాల్గొని మాట్లాడారు. ఎంపిడిఒ గీతావాణి, తహశీల్దార్ శివరాముడు, సర్పంచులు వరదప్ప, జనసేన నాయకులు మల్లప్ప, గుడిసె ఆది కృష్ణమ్మ, ఇఒఆర్‌డి నాగరాజ్, ఇస్వి ఎస్ఐ నాగేంద్ర పాల్గొన్నారు. **కౌతాళంలో** 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు చెన్న బసప్ప, శివ మోహన్ రెడ్డి, కొట్రేష్ గౌడ్‌లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి సహకారంతో అభివృద్ధిని, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. మల్లికార్జున స్వామి, ఎంపిడిఒ సుబ్బరాజు, బిజెపి నాయకులు రామకృష్ణ, టిడిపి నాయకులు కురుగోడు, రమేష్ గౌడ్, నీలకంఠ రెడ్డి, కాశీ విశ్వనాథ్, సోమన్న, సిద్ధు, రహిమాన్, భీమయ్య, సురేంద్ర పాల్గొన్నారు.



మంత్రాలయంలో మాట్లాడుతున్న ఎంపీ



నందవరంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ



ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు



కౌతాళంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పేదలకు ఉచిత సేవ చేయాలి

- వైద్య విద్యార్థిని విజయ లక్ష్మికి ఎంపీ అభినందన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పేదలకు ఉచిత సేవలందించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. గోనెగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన కురువ విజయలక్ష్మి ఎంబిబిఎస్ సీటు సాధించడంతో మంగళవారం ఎమ్మిగనూరులో ఎంపీ బస్తిపాటి నాగరాజు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో కురువ కుటుంబంలో ఎంబిబిఎస్ సీటు సాధించడం గర్వకారణమన్నారు. విజయలక్ష్మి ఇంకా మంచిగా చదువుకొని పేదలకు ఉచిత వైద్యం చేసే సేవ గుణం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థి తల్లిదండ్రులు లలిత, జనార్దన్, బోడబండ నరసింహులు, మద్దిలేటి, ఆపిల్ ల్యాబ్ బీరప్ప పాల్గొన్నారు.

ప్లాటినం జూబ్లీ సమ్మేళనానికి కలెక్టర్ ఆహ్వానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలలో ఈనెల 29న జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి కలెక్టర్ రంజిత్ బాషను ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యులు బైలుప్పల షఫీవుల్లా, విశ్రాంత తహశీల్దార్ సిబి.అజయ్ కుమార్, సయ్యద్ రోషన్ అలీ మంగళవారం ఆహ్వానించారు. పూర్వ విద్యా ర్థుల 75వ వసంతాల పండుగలో పాలుపంచు కొని తమను ఆనందింపజేయాలని కోరారు.

ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్ చార్జీలను

ప్రభుత్వమే భరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీలకు ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, శైలజ, సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు కావాలంటే నెలకు రూ.300లకు పైగా ఖర్చు అవుతోందని, విద్యుత్ చార్జీలు కూడా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు బండ లత, వెంకటేశ్వరమ్మ, సుజాత, ఉమాదేవి, షమీమ్, సునీత పాల్గొన్నారు.

ముగిసిన ఎద్దుల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో శ్రీచింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో న్యూ కేటగిరి విభాగంలో గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గరికపాటి లక్ష్మయ్య చౌదరి, కడప జిల్లా అయోధ్య నగర్ వెంకట సాయిదీనీత్ రెడ్డికి చెందిన ఎద్దులు ఉమ్మడి విజేతలుగా నిలిచాయి. 3వ బహుమతి కర్నూలు జిల్లా కలుగొట్లకు చెందిన గొంది బజారు, నాలుగో బహుమతి రేమటకు చెందిన గిడ్డయ్య నాయుడు, ఐదో బహుమతి నంద్యాల జిల్లా రుద్రవరానికి చెందిన ఎల్లాగౌడ్, ఆరో బహుమతి నంద్యాల జిల్లా బోయలకుంట్లకు చెందిన షేక్ మదార్ ఎద్దులు గెలుపొందాయి. ఆరుపండ్ల విభాగంలో మొదటి బహుమతి నాగర్ కర్నూలు జిల్లా రాయవరానికి చెందిన అక్షర రెడ్డి, రెండో బహుమతి కోడుమూరుకు చెందిన బిఎల్‌కె బుల్స్, మూడో బహుమతి నంద్యాల జిల్లా పిన్నాపురానికి చెందిన అభిజ్ఞ లక్ష్మి, నాలుగో బహుమతి గద్వాల జిల్లా జరదొడ్డికి చెందిన కలుగట్ల రమేష్ నాయుడు, జానకి రాముడు, ఐదో బహుమతి ఉత్తనూరుకు చెందిన భీమ్ రెడ్డి జరదొడ్డి నరేష్, ఆరో బహుమతి ఎ.నారాయణపురానికి చెందిన మహబూబ్ బాషా, కలగొట్లకు చెందిన రమేష్ నాయుడు వృషభాలు గెలుపొందాయి. గాజుల కుమారస్వామి, అమరేశ్వరప్ప ఆధ్వర్యంలో ఈదుల దేవరబండ సుభాన్, కట్టుబడి ఖలీల్ బహుమతులు ప్రదానం చేశారు. మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మన్సూర్, ట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు రాంపురం లాలు, కె.హుసేన్ బీ, వెంకటేష్ రాజు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నల్లారెడ్డి స్వామిని దర్శించుకున్న వైసిపి నాయకులు

శ్రీచింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి, కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతుల్, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్ చింతలముని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపిపి నసురుద్దీన్, బందేనవాజ్, మురళీ నాయుడు, మన్సూర్, భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, ముగతి విరుపాక్షిరెడ్డి, మహబూబ్ బేగ్ పాల్గొన్నారు.



చింతలముని ఆలయంలో వైసిపి నాయకులు

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. వరి సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది'కి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. మంగళవారం మండలంలోని ముగతి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీర్వాదంతో ఆర్‌డిఎస్ ప్రాజెకును పూర్తి చేసి ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని తెలిపారు. అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ కృపారావు, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య, జెడిఎ వరలక్ష్మి, ఎఒ స్రవంతి, సురేంద్ర, టిడిపి మండల నాయకులు, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్నగౌడ్, మాధవరావు దేశాయ్, రైస్ మిల్ నారాయణరెడ్డి, ముగతి అధ్యక్షులు భార్గవ్ యాదవ్, మండల కన్వీనర్ చిన్న రాముడు, వెలుగు సిసి చిన్నమ్మ నాయకులు కొండారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని మాధవరం గ్రామంలోని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో 'పొలం పిలుస్తోంది' గోడపత్రికను ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి విడుదల చేశారు. ఎఒలు కె.శేషాద్రి, ఎం.వర ప్రసాద్, జె.గణేష్, ఎం.రాజు, బిజెపి ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జీ లక్ష్మన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలం పెద్దనేలటూరు గ్రామంలో ఎఒ హేమలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు నిత్యజీవన్, సునీత, అలువాల ఎంపిఒ రమేష్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని గుమ్మనూరు, రామదుర్గం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. పంటల్లో అధిక దిగుబడి ఎలా సాధించాలనే కోణంలో రైతులకు అవగాహన కల్పించారు. ఎఒ జయలక్ష్మి, అసిస్టెంట్లు మనోహర్, కుమార్ పాల్గొన్నారు.

'కడలి కెరటాలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పట్టణంలోని వైఎస్‌ఆర్ సర్కిల్‌లో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో 'కడలి కెరటాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. గణితోపాధ్యాయులు, ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 55వ పుస్తకం 'కడలి కెరటాలు' పుస్తకాన్ని మంగళవారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లారి నాగరాజు, వై.ఎల్లప్ప, దావీదు, పౌరోహితం శ్రీనివాసులు, డి.కేశవయ్య ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని కవిరత్న, సీనియర్ ఉపాధ్యాయులు ఆరెకటికె నాగేశ్వరరావుకు అంకితం చేశారు. అనతి కాలంలోనే 55 పుస్తకాలు రాసి ముద్రించిన గద్వాల సోమన్నను, కృతి స్వీకర్త నాగేశ్వరరావును, అతిథులను సన్మానించారు. ఉపాధ్యాయులు చంద్రపాల్, కౌలన్న, పాపయ్య, వై.రామాంజనేయులు, బి.రాఘవేంద్ర, కె.వీరప్పాసద్, విశ్రాంత గ్రంథాలయ శాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, కరుణం పాపన్న పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

జింకల బారి నుంచి పంటలను రక్షించాలి

- డిప్యూటీ తహశీల్దార్‌కు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - ఆస్పరి

జింకల బారి నుంచి పంటలను రక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు కోరారు. పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు ఇస్తానన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసంఘం కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా పెట్టుబడి సహాయం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. పెట్టుబడుల కోసం బ్యాంకులు, ప్రయివేట్ వ్యాపారుల దగ్గరకెళ్లి అధిక వడ్డీలకు అప్పు చేయాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో జింకల సమస్య తీవ్రంగా ఉందని, రైతులు వేసిన పంటలను జింకలు నాశనం చేస్తున్నాయని చెప్పారు. అటవీ శాఖాధికారులకు, రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మోటార్లకు మీటర్లు పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, చిన్న ఈరన్న, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు రవి, నరేంద్ర, రైతు సంఘం సీనియర్ నాయకులు వీరభద్ర, వీరేష్, రాముడు, వీరేష్, రవి, కాశన్న, వీర భద్రి పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్ గాయత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి రాణించాలని ఎంఇఒ అబ్దుల్ కలాం అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్) ఆటల పోటీలను కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హుస్సేన్‌య్య అధ్యక్షతన ఎంఇఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజక వర్గ స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎలు, పిఇటిలు, కో ఆర్డినేటర్ శ్రీనివాసమూర్తి, పీడీలు కంభగిరి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా భావించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - బనగానపల్లె

విద్యార్థులు గెలుపోటములను సమానంగా భావించాలని ఎంఈఓ స్వరూప పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 బాలబాలికల ఎంపిక పోటీలను ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాందిగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గౌరీ శంకర్, మండల కోఆర్డినేటర్ జి. శ్రీనివాసులు సురేంద్ర, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మధు, నియోజకవర్గం కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

ప్రజాశక్తి - బనగానపల్లె

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోవిందిన్నె ప్రాథమిక పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చిలకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు పూసపాటి బాలాజీ సహకారంతో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నుల పంపిణీ చేశారు. అనంతరం చెట్ల పెంపకం విశిష్టతపై కరపత్రాలను ఆవిష్కరించి, సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.యాస్మిన్, ఉపాధ్యాయుడు పివి.నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలుకూరు తెలుగు భాష సంఘం అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

29 నుండి క్లస్టర్ ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిబిఎస్ఇ క్లస్టర్ ఫుట్‌బాల్ పోటీలు ఈనెల 29 నుండి అక్టోబర్ 2 వరకు రిడ్జ్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల సిఇఒ గోపీనాథ్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి దాదాపుగా 145 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఓర్వకల్లు ఎంపిడిఒగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు ఎంపిడిఒగా శ్రీనివాసులును బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ సిఇఒ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం ఆయన డోన్‌లో ఎంపిడిఒగా పని చేస్తూ ఇక్కడికి బదిలీ మీద వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ నాగ శివప్రసాదును గూడూరు మండలానికి బదిలీ చేశారు.



మాట్లాడుతున్న టిడిపి నగర అధ్యక్షులు డి.నాగరాజు

42 వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూల్ నగరంలోని 42 వార్డు బాబా బందావన నగర్ లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ,నగర అధ్యక్షులు డి.నాగరాజు స్థానిక టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. వంద రోజులు పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఎన్నికైన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తున్న మాట తప్పని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. అంతకుముందు జిల్లా టిడిపి కార్యాలయం ఎదుట ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్లో టీటీడీ లడ్డు కల్తీకి గత ప్రభుత్వం పాల్పడిందని ఆరోపణంగా నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నాయకులు కుర్వ పరమేష్, రమణమ్మ, డి.జేమ్స్, సత్రం రామక్రిష్ణుడు, గున్నా మార్క్, కొరకంచి రవికుమార్, చంద్రశేఖర్, పాత్రలాజ్, స్వామిరెడ్డి, బేతం క్రిష్ణుడు, మోతిలాల్, విజయలక్ష్మీ, రామక్రిష్ణ, జనసేన పవన్, మొదలగు వారితోపాటు తెలుగుయువత కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం:టిడిపి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు ఎంపిడిఒ చంద్రశేఖర రావు. టిడిపి నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి , కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు మంగళవారం కోడుమూరు ఎంపిడిఒ చంద్రశేఖర రావు , గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు , స్టిక్కర్లను ఇంటింటికి తిరిగి ప్రజల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించి చైతన్యం కల్పించారు. టిడిపి నాయకులు కెఇ. మల్లికార్జున గౌడ్, రవీంద్ర గౌడ్, గోపాల్ నాయుడు, చేనేత భాస్కర్, బ్రిటిష్ రాముడు, వార్డు మెంబర్ రామచంద్రుడు, ఇంతియాజ్ భాష, రాము, మధు, ధర్మ గంగాధర్ నాయుడు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలులో ఎపి హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రకటనను రాయలసీమ న్యాయవాదుల జెఎసి కన్వీనర్ సీనియర్ న్యాయవాది వై.జయరాజు స్వాగతించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఎపిలో హైకోర్టు లేదా కనీసం హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలనేది రాయలసీమ ప్రాంత డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. కేబినెట్ తీర్మానాన్ని ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపడం ద్వారా అధికారిక ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని , సుప్రీంకోర్టు నుండి వీలైనంత త్వరగా అవసరమైన ఆమోదం పొందాలని ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరారు. కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి బి.కృష్ణమూర్తి, రవికాంత్ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

రాయలసీమ సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టండి : బొజ్జ

ప్రజాశక్తి - నంద్యాల

రాయలసీమ సాగునీటి రంగం శిథిలావస్థకు చేరిందని, ఈ పరిస్థితిని అత్యంత ప్రాధాన్యతతో చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నంద్యాల సమితి కార్యాలయంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి దశరథ రామిరెడ్డి మాట్లాడారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నా, రాయలసీమ ప్రాజెక్టులకు నీరందడం లేదనే విషయాన్ని పౌర సమాజానికి తెలియజేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతను గుర్తు చేస్తూ రాయలసీమ సాగునీటి సాధన సమితి ఈనెల 12న నంద్యాలలో సమావేశం నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమ ప్రాజెక్టులను స్థితిగతులు స్వయంగా తెలుసుకొనే నేపథ్యంలో, ముందుగా హంద్రీనీవా ప్రాజెక్టు స్థితిగతులు తెలుసు కోవడానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు రాయలసీమ జిల్లాల పర్యటనకు విచ్చేసినందుకు వారికి అభినందనలు తెలియజేస్తున్నా మన్నారు. 2014-19లో టిడిపి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సాగునీటి బడ్జెట్‌లో రాయలసీమకు సాగునీటి రంగానికి 17 శాతం నిధులు ఖర్చు చేసిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీ నీవా ప్రాజెక్టు సందర్భంగా ప్రకటించారన్నారు. 2019 - 24లో వైసిపి ప్రభుత్వం కేవలం 6 శాతం నిధులను మాత్రమే రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేసారని ప్రకటించారని చెప్పారు. వైసిపి ఆధ్వర్యంలోని ప్రభుత్వం కంటే టిడిపి ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిధులు అధికంగా కేటాయించి నప్పటికీ రాయల సీమ సాగునీటి రంగంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, అందుకు నాలుగు దశాబ్దాలుగా ప్రారంభమైన హంద్రీనీవా ప్రాజెక్టులో భాగమైన పందికోన రిజర్వాయర్ దుస్థితి అద్దం పడుతుందన్నారు. పందికోన రిజర్వాయర్‌కు ప్రస్తుతం నీటిని నింపతున్న లెక్కన నిర్ధేశిత నీటిని నింపడానికి 464 రోజులు పడుతుందని, సంవత్సరంలో ఉన్నది 365 రోజులే అన్నారు. అంతే కాకుండా పంట కాలం కూడా 90 నుండి 120 రోజులు. ఈ వ్యవదిలో రిజర్వాయర్‌కు నీరు అందించలేకపోతే వ్యవసాయం తిరోగమన దిశగా ఉంటుదని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టులో మొట్టమొదటిగా ఉన్న రిజర్వాయర్ పరిస్థితే ఇలా ఉంటే ప్రాజెక్టు చివరన ముఖ్యమంత్రి ప్రాతి నిధ్యం వహిస్తున్న కుప్పం దుస్థితి గురించి వివరించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు నీళ్ళు ఇస్తాం.. ప్రజల దాహార్తిని తీరుస్తాం.. అనే వాగ్ధానాలు రాయలసీమను రత్నాల సీమను చేయలేవని, ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనకకు లాగా ఉన్న రాయలసీమ సాగునీటి రంగాన్ని తక్షణమే గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో 42 శాతం ఉన్న రాయలసీమకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాగునీటి బడ్జెట్ లో 42 శాతం రాయలసీమకు కేటాయించి, రాయలసీమ సాగునీటి రంగంలో పురోగతిని సత్వరమే సాధించడానికి కృషి చెయ్యాలని, అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సమానంగా రాయలసీమ సాగునీటి రంగం అభివద్ధి చెందడానికి ఈ నిధులతో పాటుగా కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన లేదా వేరే ఫథకాల ద్వారా, స్పెషల్ పర్పస్ వెహికల్, ప్రపంచ బ్యాంకు రుణాల ద్వారా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు సేవచేయడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి సి బెళగల్

ప్రజలకు మేలైన ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పేర్కొన్నారు. మంగళవారం పోలకల్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇందులో నాయకులు చిన్న తిమ్మప్ప, గోవింద్ గౌడ్, భీమన్న, అమర్, హరి, ధనుంజయ, అధికారులు ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి సందీప్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడే ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అవసరమైన శాశ్వత పనులకు నివేదికలు తయారు చేస్తున్నట్లు తెలిపి అందుకు అందరు భాగస్వామ్యం కావాలన్నారు.

పోలకల్ లో హాస్టల్ ఏర్పాటు చేయాలి: గ్రామ పెద్దలు

పోలకల్ లో ఐదు ప్రభుత్వ బడులు ఉన్నాయని, సుమారు 1500 వరకు విద్యార్థులు చదువుతున్నారని, హాస్టల్ వసతి కల్పించాలని గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఎమ్మెల్యే కు విన్నవించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం అనంతరం పోలకల్‌లో హైస్కూల్ ను తనిఖీ చేశారు. ఇక్కడే తప్పకుండా ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు.



సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ కొనియాడారు. మంగళవారం ఉర్దూ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, ఎన్ఎస్ఎస్. అధికారులు డాక్టర్ వెంకటప్ప, డాక్టర్ పాల్‌కృపాకర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తోందిలో రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్



- కోడుమూరులో రైతులకు అవగాహన

పొలం పిలుస్తుంది కార్యక్రమం కోడుమూరు మండల కేంద్రంలో మంగళవార జరిగింది. మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ తో పాటు డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించిన మండల ఎఒ .సుధారాణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రసూలు ,జయంత్, విజయశాంతి , రైతులు పాల్గొన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ముందుగా రైతుల పొలాలను పరిశీలించి అక్కడ ఉన్న చీడపీడలు, తెగుళ్లమొక్కలలో న్యూట్రిషియన్స్ డెఫిషియన్సీ రైతులకు చూపిస్తూ సూచనలిస్తూ పొలంలో తిరుగుతూ తర్వాత గ్రామంలో రైతు సేవ కేంద్రం దగ్గర, రచ్చకట్ట దగ్గర రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వాళ్ల అనుసరిస్తున్న విధానాలు , కొత్త టెక్నాలజీని రైతులకు అందిస్తూ పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖతోపాటు అనుబంధ శాఖలైనటువంటి పశు సంవర్ధక శాఖ డ్రిప్ ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయలసీమ వర్సిటీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగర శివారులలోనిరాయలసీమ వర్సిటీలో ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ పి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. విద్యార్థులు రక్తదానం చేసి ఇతరులకు ప్రాణదాతలు కావాలని కోరారు. ఎగ్జామినేషన్స్‌డీన్ సుందరానందపుచ్చ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లతో రోడ్లు మంజూరు చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. మంగళవారం పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని విధాలుగా ప్రభుత్వం కషి చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఆళ్లగడ్డ క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు జిల్లాస్థాయిలో స్కూల్ గేమ్స్ పోటీలలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మురళీధర్ మంగళవారం తెలిపారు. ఈనెల 21న కర్నూలు లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం నందు జరిగిన అండర్-17 బాయ్స్ సెపక్ తక్రా విభాగంలో పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి వేమ నారాయణరెడ్డి ప్రతిభ చూపారన్నారు. అదేవిధంగా 23న నంద్యాలలోని కే.ఎన్.ఎమ్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు యుగంధర్ , ధర్మ దస్తగిరి (పదవ తరగతి) వెంకట సంతోష్ కుమార్ రెడ్డి(ఏడో తరగతి) అండర్ 17 బాయ్స్ రోప్ స్కిప్పింగ్ విభాగంలో వేమ నారాయణ రెడ్డి జిల్లాస్థాయి లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులను, వారి విజయానికి కృషి చేసిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాబును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీధర్ అభినందించారు.

సిబిఎస్ఇ పరీక్షలకు ఉర్దూ భాష అనుమతి నిరాకరణ

- విద్యా హక్కును కాల రాయడమే : ముస్లిం జెఎసి

ప్రజాశక్తి - నంద్యాల

ఉర్దూ మీడియం విద్యార్థులు వారి మాతృభాషలో అనుమతి లేకుండా పరీక్షలు రాయకూడదనే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్ణయం విద్యాహక్కును కాలరాయడమేనని నంద్యాల ముస్లిం జెఎసి గౌరవాధ్యక్షులు ఎస్.ఎండి.అబులైస్, షేక్ అబ్దుల్ సమద్‌లు అన్నారు. మంగళవారం స్థానిక జెఎసి కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఉర్దూ భాషపై వివక్షతో సీబీఎస్ఇ తీసుకున్న నిర్ణయం ఆక్షేపనీయమన్నారు. ఇది 20 కోట్ల మంది భారతీయుల మాతృ భాషపై దాడి అని, సిబిఎస్ఇ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంజెఎసి మీడియా ప్రతినిధి జాకీర్, మునిర్ అహ్మద్, మార్కెట్ అర్షద్, జెఐహెచ్ జకారియా, ఖిద్మత్ ఫయాజ్, యూనుస్, తవ్వేవాలె షఫీ తదితరులు పాల్గొన్నారు.



రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రైతులు ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని కోవెలకుంట్ల ఏడిఏ సుధాకర్ అన్నారు. దొర్నిపాడు మండలంలోని దొర్నిపాడు, క్రిష్టిపాడు రైతు సేవ కేంద్రాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారి సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలిచి రైతులకు కావాల్సిన వ్యవసాయ, అనుబంధ శాఖల విషయాలను తెలియజేస్తూ రైతు సమస్యలను అధిగమిస్తూ, అధిక దిగుబడి సాధించే దిశగా రైతులకు సహకారం అందించేందుకు ప్రభుత్వం "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున, వ్యవసాయ, అనుబంధ రంగాల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు , శాస్త్రవేతలు గ్రామాలను సందర్శిస్తారన్నారు.పంట దిగుబడులు తగ్గడానికి గల కారణాలను విశ్లేషించడం , సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి, భూసారం పెంచేలా చర్యలు చేపడతారన్నారు. ఏవో సునీత మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొర్నిపాడు, క్రిష్టిపాడు గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించండి : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడిఏ రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని బాచేపల్లి, అహెూబిలం గ్రామాలలో వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రభుత్వ పథకాలు, పంటలపై పాటించు మేలైన యాజమాన్య పద్ధతుల గురించి చర్చించారు. అనంతరం రైతుల పొలాలను సందర్శించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ, మార్కెట్ యార్డ్, హార్టికల్చర్ మరియు ప్రకృతి వ్యవసాయం అధికారులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** రైతులు ఎప్పటికప్పుడు పంటలలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో సర్పంచి లక్ష్మిదేవి అధ్యకతన వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మండల పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈఓ మంజుల, విహెచ్ఏలు ఉమా, ఫరూఖ్, షాహిదా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **రుద్రవరం :** పంట సాగులో రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించినట్లు వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. మండలంలోని కోటకొండ, యల్లావత్తల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతు సేవ కేంద్రం సిబ్బంది రేవతి, వెటర్నరీ అసిస్టెంట్ బాలు నాయక్, యల్లావత్తుల గ్రామ సర్పంచ్ చంద్రమోహన్, రైతులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులను వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమణయ్య పేర్కొన్నారు. మండలంలోని యాగంటి పల్లె, మీరాపురం రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణయ్య మాట్లాడుతూ రైతులు మూడు సంవత్సరాలకోసారి పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. గతంలో తీసిన మట్టి పరీక్షల ఫలితాలను రైతులకు అందజేశారు. పాడిపంటల మ్యాగజైన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి, మీరాపురం భాస్కర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రైతులు, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. **అవుకు :** అవుకు మండలంలోని చనుగొండ్ల, సంఘపట్నం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ రైతులకు భూసార పరీక్షల కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు ఉగ్రసేనారెడ్డి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **బేతంచర్ల :** రైతులు సాగు చేసిన పంట పొలాలకు సంబంధించిన సమస్యలకు క్షేత్రస్థాయిలో పరిష్కారం జరిగేలా 'పొలం పిలుస్తుంది' ఉపయోగ పడుతుందని డోన్ అగ్రికల్చర్ ఆఫీసర్ ఎడిఎ అశోక్ వర్ధన్ రెడ్డి అన్నారు. ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల్లో మండలం వ్యవసాయ అధికారి జి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు కంది, పత్తి, ఆముదం తదితర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట పొలాల్లో చీడపీడల నివారణకు, పంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ మధు, బెన్ని రాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది యశోద భారతి, వైష్ణవి, సుధాకర్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ రవీంద్ర, శాంతి ప్రియ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త వెంకటరమణ, అంబాపురం, రంగాపురం గ్రామాల రైతులు పాల్గొన్నారు. **మహానంది :** ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేసి మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి బి నాగేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బసవాపురం, గాజులపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించి పంటల సమగ్ర సస్యరక్షణపై రైతులకు వివరించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు ఉపయోగించి ఖర్చు తగ్గించుకోవాలని తెలిపారు. మినుము పంట సాగు చేసే ముందు ఇమిడాక్లోప్రిడ్ అనే మందును ఐదు మిల్లీ లీటర్లు ఒక కిలో విత్తనానికి లేదా థయోమితాక్సం అనే మందును ఐదు గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకుంటే 15 నుండి 20 రోజుల వరకు రసం పీల్చు పురుగుల భారి నుండి రక్షించుకోవచ్చు. పల్లాకు, వైరస్ తెగుళు వ్యాప్తి చెందకుండా ఉండటానికి పంట తొలి దశలలో వేప నూనెను పిచికారి చేసుకోవాలని సూచించారు. వెటర్నరీ అధికారి రామలక్ష్మమ్మ పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణపై వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పల్లవి, షైనీ, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ : వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు రైతులు పంటలు సాగు చేసి అధిక దిగులు సాధించాలని ఆంజనేయులు అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పొలం బడి పిలుస్తుందిలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖల మాజీ చైర్మన్ వంగల శివ రామి రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్, మండల వ్యసాయాధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ఏఆర్ ఎస్ అశోక్ కుమార్‌లు మాట్లాడారు. మొక్కజొన్న, మినుము, మిరప పంటల్లో అవలంబించే యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. స్ప్రింక్లర్స్, డ్రిప్ పైపులు సబ్సిడీ కింద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** వ్యవసాయంలో అధునాత పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని మండల వ్యవసాయ అధికారి పణీశ్వర్ రెడ్డి రైతులను కోరారు. లింగాల, వేంపెంట గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. మొక్కజొన్న, మినుము తదితర పంటలను ఆశించే తెగుళ్లపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పట్టు వ్యవసాయం అధికారి పి. ప్రసాదరావు, వీహెచ్ ఏవిజయ్, ఎంపీఈవో సునీతమ్మ, వెటర్నరి నాగేశ్వరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ : పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



బనగానపల్లెలో..



మహానందిలో..



బేతంచెర్లలో..



చాగలమర్రిలో..



ఆత్మకూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం



పాములపాడులో..



రుద్రవరంలో..